పిడుగుపాటుకు ఇద్దరు కూలీల మృతి



మృతదేహాన్ని పొలం నుంచి మంచంపై మోసుకొస్తున్న సహచర కూలీలు




మృతి చెందిన మణి, రాము

పిచ్చాటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం హనుమంతాపురం వ్యవసాయ పొలాల్లోని ఇద్దరు కూలీలు పిడుగు పాటుకు మృతిచెందారు. ఆ గ్రామానికి చెందిన దామోదరం పొలంలో కూలి పని చేయడానికి అదే గ్రామం అరుంధతివాడకు చెందిన మణి(54), రాము(59) శుక్రవారం వెళ్లారు. మధ్యాహ్నం గాలి వాన, ఉరుముల శబ్దాలకు భయాందోళన చెంది పొలం నుంచి బయటకు వస్తున్నారు. ఆ సమయంలో పిడుగు పడటంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరి మృతదేహాలను సహచర కూలీలు పొలాల నుంచి మంచంపై గ్రామానికి మోసుకొచ్చారు. మణికి భార్య, ముగ్గురు కుమారులు ఉండగా.. రాముకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. వీరిద్దరి మృతితో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

భూమికి పచ్చాని చీర

ముసురు వానలు తెచ్చిన అందం ఇది. చెట్టూచేమా చిగురించింది. పొలాలన్నీ పచ్చని తివాచీ పరిచినట్లుగా మారాయి. మబ్బూ ఎండా దోబూచులాడాయి. తెల్లని కొంగలు ఆకాశంలో బారులు తీరాయి. పెళ్లకూరు మండలం జీలపాటూరు నుంచి దొడ్లవారిమిట్టకు వెళ్లే తోవలో శుక్రవారం కనిపించిన కమనీయ దృశ్యం ఇది.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి





పాండురంగయ్యగారిపల్లిలో 104 వాహనం వద్ద వైద్యులు లేకుండా సిబ్బందే విధులు నిర్వర్తిస్తున్న దృశ్యం



గ్రామ సచివాలయ భవనంలోని ఒక గదిలో నడుస్తున్న కొటాల పీహెచ్‌సీ

ఆంధ్రజ్యోతి విజిట్

ఛ... ఏం బాగోలేదు!

- సచివాలయం గదిలో కొటాల పీహెచ్‌సీ
- ఇద్దరు డాక్టర్లూ విధులకు గైర్హాజరు
- సీఎం సొంత మండలంలో ఆరోగ్య కేంద్రం తీరు
- జిల్లాలో పీహెచ్‌సీలకు సుస్తీ
- 'ఆంధ్రజ్యోతి విజిట్'లో వెలుగు చూసిన సమస్యలు

జిల్లాలో పీహెచ్‌సీలకు సుస్తీ చేసింది. పలుచోట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే.. కొన్నిచోట్ల మౌలిక వసతులు సరిగా లేవు. దీనికి సీఎం సొంత మండలంలోని కొటాల పీహెచ్‌సీ కూడా మినహాయింపేమీ కాదు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ చేపట్టిన పరిశీలనలో వెల్లడైన వాస్తవాలిలా ఉన్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కొటాల.. ఏంటిలా

ఈ చిత్రం చూడండి. డాక్టర్లు కూర్చుని రోగులకు వైద్య సేవలందించాల్సిన చోట ఇద్దరు స్టాఫ్ నర్సులు, అటెండరు ఉన్నారు. వీరే డాక్టర్ విధులను నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు కనిపించిన దృశ్యమిది. ఇద్దరు డాక్టర్లున్నా ఆరోగ్య కేంద్రానికి రాలేదు. అక్కడికి సమీపంలోని పాండురంగయ్యగారిపల్లిలో 104 వాహనం ద్వారా వైద్య సేవలందిస్తున్నారని సిబ్బంది చెప్పారు. అక్కడా సిబ్బంది తప్ప డాక్టర్లు కనిపించలేదు. ఈ పీహెచ్‌సీకి ఏడేళ్లుగా సొంత భవనం లేదు. తొలుత హైస్కూలు భవనంలో నడవగా ప్రస్తుతం గ్రామ సచివాలయ భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టెక్నీషియన్లను నియమించినా పని చేయడానికి ల్యాబ్ గానీ, పరికరాలు గానీ, ఎక్స్‌రే యూనిట్ గానీ లేవు. చివరికి సిబ్బంది సమీక్షా సమావేశాలు సైతం ఈ చిన్నగదిలో జరిపే వీల్లేక.. చంద్రగిరి ప్రభుత్వాస్పత్రికి వెళుతుంటారు. ఇంతకీ చెప్పలేదు కదా.. ఈ కొటాల పీహెచ్‌సీ ఉన్నది మరెక్కడో కాదు. సాక్షాత్తూ సీఎం చంద్రబాబు సొంత మండలమైన చంద్రగిరి పరిధిలో. ఆయన స్వగ్రామమైన నారావారి పల్లెకు ఐదు కిలోమీటర్ల చేరువలో.



ఓపీలో రోగులకు చీటీలు రాస్తున్న టెక్నీషియన్

టెక్నీషియన్‌కు పనేదీ?

డక్కిలి పీహెచ్‌సీలో రెండు గంటలు ఆలస్యంగా 10 గంటలకు స్టాఫ్ నర్సు హాజరయ్యారు. ఎక్స్‌రే టెక్నీషియన్ ఓపీలో రోగులకు చీటీలు రాస్తూ కనిపించారు. ఆరా తీస్తే ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టు ఉండటంతో ఆయన్ను నియమించారు అయితే ఆయన పనిచేయడానికి ఎక్స్‌రే పరికరాలు మాత్రం లేవు. దీంతో ఖాళీగా ఉండటం ఎందుకని ఓపీలో రోగులకు చీటీలు రాస్తున్నారు.

వానొస్తే బకెట్ పెట్టాల్సిందే

ఇది బాలాయపల్లి పీహెచ్‌సీలోని ప్రసూతి గది. పైకప్పు దెబ్బతినడంతో వర్షానికి ఉరుస్తోంది. అందుకే నీళ్లు కారుతున్న చోట ఇలా బకెట్ పెట్టారు. పైకప్పు మొత్తం బలహీనపడిపోయి కాంక్రీటు పెచ్చులూడి పడుతున్నాయి. వ్యాక్సిన్ నిల్వ ఉంచిన గదిలోనూ ఇదే పరిస్థితి.



జయంపు వైద్యురాలికి బాలాయపల్లిలో డ్యూటీ

బాలాయపల్లి నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న జయంపు గ్రామంలో ప్రభుత్వం ఏడాదన్నర కిందట పీహెచ్‌సీ మంజూరు చేసింది. భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణం మొదలు కాలేదు. భవన వసతి లేకపోవడంతో ఒక డాక్టర్ పోస్టు మాత్రమే మంజూరైంది. ఇక్కడ మహిళా వైద్యురాలిగా నియమితులైన వియోనా.. ఏడాదిగా బాలాయపల్లి పీహెచ్‌సీలోనే విధులు నిర్వర్తిస్తున్నారు.

అరువుపై మందులు

వెంకటగిరి మండలం బంగారుపేట పీహెచ్‌సీలో పాముకాటుకు మందు అందుబాటులో లేదు. రోగుల సంఖ్య ఎక్కువ కావడంతో నెలవారీ కేటాయిస్తున్న మందులు సరిపోవడం లేదు. దీంతో ఇరుగుపొరుగు పీహెచ్‌సీల నుంచి అరువుపై మందులు తెప్పించుకుంటున్నారు. ఇక్కడ ముగ్గురు డాక్టర్లు ఉండగా.. ఒకరు పొరుగు నియోజకవర్గంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా అదనపు విధులు నిర్వర్తిస్తున్నారు. స్టాఫ్ నర్సులు నలుగురు వుండగా ఒకరు నెల్లూరు జిల్లా మనుబోలులో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా వుంది. దీంతో వారంలో మూడు రోజుల పాటు జీకేపల్లి పీహెచ్‌సీ నుంచీ టెక్నీషియన్ డెప్యుటేషన్‌పై వచ్చి వెళుతున్నారు.

చిన్నతోటలో రెండు డాక్టరు పోస్టులూ ఖాళీ

వాకాడు మండలంలో బాలిరెడ్డిపాలెం, నిడిగుర్తి, చిన్నతోటలో పీహెచ్‌సీలు ఉన్నాయి. నిడిగుర్తి పీహెచ్‌సీలో మాత్రమే రెండు డాక్టర్ పోస్టులూ భర్తీ అయ్యాయి. చిన్నతోట పీహెచ్‌సీలో రెండు పోస్టులూ ఖాళీగా వున్నాయి. దీంతో కోట నుంచి ఒకరు, చిట్టమూరు నుంచి ఒకరు చొప్పున డిప్యుటేషన్ మీద డాక్టర్లు వచ్చి వెళుతున్నారు. మూడు స్టాఫ్ నర్సు పోస్టుల్లో ఒకటి ఖాళీగా వుంది. ఇక బాలిరెడ్డిపాలెంలో రెండు డాక్టర్ పోస్టులకు గానూ ఒకటి ఖాళీ. అక్కడికి కూడా కోట నుంచీ డాక్టర్ ఒకరు డెప్యుటేషన్‌పై విధులకు వస్తున్నారు.



ఈ పీహెచ్‌సీలలో ల్యాబ్ పరీక్షలకు ఇక్కట్లు

చిట్టమూరు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేరు. దీంతో మల్లాం నుంచి డెప్యుటేషన్‌పై వచ్చి వెళుతున్నారు. దొరవారిసత్రం పీహెచ్‌సీ లేబొరేటరీలో పరికరాలు వుండి పనిచేస్తున్నా కూడా ల్యాబ్ టెక్నీషియన్ రోగులను ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సూళ్ళూరుపేట మండలం పేర్నాడు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేరు. రోగులకు అసౌకర్యంగా వుంది. పరికరాలున్నా టెక్నీషియన్ లేనందున ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి అర్బన్ పీహెచ్‌సీలో ల్యాబ్‌లో పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ఈ నెల స్టాక్ ఇంతవరకూ సరఫరా కాలేదు. వెంకటగిరి మండలం జీకేపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్, పరికరాలున్నా టెక్నీషియన్ పోస్టు ఖాళీగా వుంది.



సూళ్ళూరుపేట మండలం పేర్నాడు పీహెచ్‌సీలో టెక్నీషియన్ లేక నిరుపయోగంగా ఉన్న ల్యాబ్

వడమాలపేటలో ముఖ్యమైన మందుల కొరత

వడమాలపేట పీహెచ్‌సీలో డాక్టర్ పోస్టులు రెండుంటే ఒక్కటి ఖాళీగా ఉంది. మూడు స్టాఫ్ నర్సు పోస్టులూ లు మూడుండగా మూడూ ఖాళీగా వున్నాయి. దీంతో ఇద్దరు నర్సులు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ల్యాబ్‌లో టైఫాయిడ్ జ్వరాన్ని నిర్ధారించే పరీక్షలు చేయడం లేదు. దానికి సంబంధించిన మెటీరియల్ సరఫరా కావడం లేదు. ఇక మందులు చాలావరకూ అందుబాటులో వున్నప్పటికీ ఆరు రకాల ముఖ్యమైన మందులు మాత్రం 20 రోజులుగా లేవు.

స్టోర్ రూమ్‌గా మారిన శస్త్ర చికిత్సల గది

తిరుపతికి చేరువగా వున్న రేణిగుంట ఓ మోస్తరు పట్టణం. అక్కడి పీహెచ్‌సీలో చిన్నా చితకా శస్త్ర చికిత్సల కోసం ఏర్పాట్లు వున్నాయి. అయితే శస్త్రచికిత్సలు జరగకపోవడంతో దానికోసం ప్రత్యేకంగా కేటాయించిన గదిని సిబ్బంది స్టోర్ రూమ్‌గా వాడుకుంటున్నారు.

ఓ ప్రమాద ఘటన గురించి పోలీసులకు ఇచ్చిన సమాచారమే.. అతడిని మృత్యువు రూపంలో వెంటాడింది. పోలీసుల సూచనతో ప్రమాద స్థలం చూపేందుకు వెంట వెళ్లిన వాచర్ వెంకటేష్.. మరో వాహనం ఢీకొనడంతో మృత్యుఒడికి చేరారు. తొట్టంబేడు మండలంలో గురువారం అర్ధరాత్రి ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

ప్రమాద స్థలం చూపేందుకు వెళ్లి..!

- వాహనం ఢీకొనడంతో ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ దుర్మరణం



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం - ఇన్‌సెట్‌లో వెంకటేష్ (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ (32) దుర్మరణం చెందారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం ఎస్టీకాలనీకి చెందిన వెంకటేష్, అటవీశాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఇదే గ్రామంలోని చెక్‌పోస్టులో పనిచేసేవారు. గురువారం అర్ధరాత్రి కన్నలి గ్రామం వద్ద వెంకటేష్ విధులకు హాజరయ్యారు. అర్ధరాత్రి దాటాక విజయవాడ నుంచి కర్ణాటకకు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును.. ఎదురుగా కర్రలలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఓవైపు తగలడంతో స్వల్ప ప్రమాదం సంభవించింది. దీనిపై ఫారెస్టువాచర్ వెంకటేష్ హైవే పెట్రోల్ పోలీసులకు సమాచారమిచ్చారు. రక్షక్ వాహనంలో ఓ కానిస్టేబుల్, హోంగార్డుతో కలిసి వచ్చారు. వెంకటేష్ కూడా ప్రమాద స్థలాన్ని చూపించేందుకు వెంట వెళ్లారు. కట్టెలలోడ్‌తో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతుండగా ఓ మినీలారీ వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో కానిస్టేబుల్, హోంగార్డు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రక్షక్ వాహనంలో ఉన్న వెంకటేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సిబ్బందితో కలిసి డీఎస్పీ ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. వెంకటేష్ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి తరలించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరుపేద ఎస్టీ కుటుంబానికి చెందిన వెంకటేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్టీ కాలనీలో తీవ్ర విషాదం నెలకొంది.



మఠం భూముల్లో బహుళ అంతస్థులు
- 8లో
బాక్స్ క్రికెట్! కుమ్మేసుకోవచ్చు









గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టీడీఎల్పీ సమావేశంలో పాల్గొన్న చిత్తూరు,తిరుపతి జిల్లాల ఎమ్మెల్యేలు - ప్రసంగిస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

తిరుచ్చిపై సిరుల తల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా సాగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతి దేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ కేపీ చంద్ర శేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ శ్రీసుధ శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శిం చుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగ నాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భాకరాపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లె గ్రామంలో పుట్టారెడ్డి నారాయణరెడ్డి స్మారక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు చలపతి రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 150 మంది హాజరుకాగా 15 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు నిర్వాహకులు డమరుకనాథరెడ్డి తెలిపారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్ చేయించి తిరిగి స్వస్థలాలకు చేరుస్తామని ఆయన వివరించారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



రెడ్డికుమార్ (ఫైల్‌ఫోటో)

చంద్రగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన పాకాల వారిపల్లెలో చోటుచేసుకుంది. పాకాలవారిపల్లెకు చెందిన రెడ్డికుమార్(45) గాదంకి టోల్‌ప్లాజా సమీపంలో పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆరునెలల క్రితం రెడ్డికుమార్‌కు పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని రైలు పట్టాలపైకి వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పాకాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఉదయ్ శేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై మురికినీటి ప్రవాహం



మురికినీటిలోనే నడిచివస్తున్న రజకులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యాపారానికి అడ్డుగా ఉందని డ్రైనేజీని పూడ్చేశారు. మురికి నీటిని రోడ్డుపైకి వదిలేసి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తెచ్చిపెట్టారు. మంగళం పరిధిలోని ఆర్టీవో కార్యాలయానికి ఎదురుగా 20ఏళ్ల క్రితం దోబీ ఘాట్, శ్మశానానికి మార్గం ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించారు. తద్వారా మంగళం క్వార్టర్స్, ఎన్‌సీబీఎన్ కాలనీ, కృష్ణవేణియాదవకాలనీల నుంచి వచ్చే మురికినీరు దిగువకు వెళ్లిపోయేది. ఈ మార్గంలో ఓ స్థల యజమాని భవన దుకాణ సముదాయాన్ని అద్దెకు ఇచ్చాడు. దీనికి ముందు భాగంలో ఉన్న మురికి కాలువ వ్యాపారాలకు అడ్డుగా ఉండడంతో ఏకంగా దాన్ని పూడ్చివేశాడు. అంతటి ఆగక దోబీఘాట్ రోడ్డుపై సగానికి పైగా ర్యాంపు ఏర్పాటుచేశాడు. మురికినీటిని దోబీఘాట్, శ్మశాన రోడ్డుపై వదిలేసి చేతులు దులుపుకున్నాడు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. వాహనాలు కాదుకదా మనుషులు నడవలేనంతలా పాడైపోయింది. తద్వారా రజకులు, శ్మశానానికి వెళ్లేవారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



దోబీఘాట్ మార్గంలో ప్రవహిస్తున్న మురికి నీరు

సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మూడురోజుల పర్యటన నిమిత్తం జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ శుక్రవారం జిల్లాకు వచ్చారు. రాత్రి తిరుపతిలో బస చేసిన ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం తిరుపతిలోని తుడా కార్యాలయంలో అధికారులతో పాటు పారిశుధ్య కార్మికులతో సమావేశమవుతారు. రుయా, స్విమ్స్‌లోనూ పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహిస్తారు. 20వ తేది ఉదయం ఢిల్లీకి తిరుగు పయనం కానున్నారు. ఆయనకు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

అందుబాటులోకి 108



చంద్రగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి 108 వాహనం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. చంద్రగిరిలో నెల రోజులుగా 108 వాహనం జాడ లేక పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంపై గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు 108 వాహనానికి మరమ్మతులు పూర్తిచేసి శుక్రవారం చంద్రగిరికి పంపించారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవికి రాహుకాలం సమయంలో మూల మూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. తీర్థప్రసాద వినియోగంతో పాటూ అన్నదానం జరిగింది.

గుడిమల్లం ఆలయానికి డబుల్ రోడ్డు



ఏర్పేడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామి ఆలయానికి పాపానాయుడుపేట నుంచి డబుల్ రోడ్డును ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు తన సొంత నిధులు రూ.5లక్షలతో శ్రీకారం చుట్టారు. పాపానాయుడుపేట స్వర్ణముఖి నది ఒడ్డున మట్టితోలి రోడ్డును ఏర్పాటు చేశారు. ఇందుకు ఆ ప్రాంతంలో పొలాలు ఉన్న ఆరుగురు రైతులు సహకరించారు. దీంతో శుక్ర వారం ఆర్‌అండ్‌బీ అధికారులు, టీడీపీ నేతలు కలిసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. త్వరలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకా రంతో ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు అవుతాయని గిరినాయుడు తెలిపారు. అధికారులు ప్రమీల, మురగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువైఉన్న కనకదుర్గమ్మకు శుక్రవారం రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు చేశారు. సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

వానొస్తే తడవక తప్పదు..!

- శిథిలావస్థలో చిన్నగొట్టిగల్లు ఎస్సీ హాస్టల్ భవనం
- నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం
- ఊడిపడుతున్న పెచ్చులు
- భయపడుతున్న విద్యార్థులు, సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం

భాకరాపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చదువుతో పాటు వసతి కల్పించాలన్న ఉన్నత ఆశయంతో ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నిర్మించింది. అందులో ఒకటి చిన్నగొట్టిగల్లులోని ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం. ఇందులో ఎంతో మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారు. అలాంటి హాస్టల్ నేడు దుస్థితికి చేరింది. ఈ భవనాన్ని 1979లో అప్పటి రాయలసీమ అభివృద్ధి మండలి అధ్యక్షులు సైఫుల్లా బేగ్ ప్రారంభించారు. ఈ హాస్టల్లో చుట్టుపక్కల ప్రాం తాల నుంచి ఎంతో మంది విద్యార్థులు చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లారు. ప్రతి ఏడాదీ ఈ హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం ఆరు నుంచి పదవ తరగతి వరకు 45 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడుతోంది. భారీ వర్షాలకు ఉరుస్తోంది. వర్షం వస్తే విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమని గడుపు తున్నారు. మరుగుదొడ్లు చాలడం లేదు. దుస్థితిలో ఉన్న భవనం చూసి ఈ ఏడాది చాలామంది విద్యార్థులు ఇక్కడ చేరడానికి వచ్చి వెనక్కు వెళ్లిపోయారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



నీళ్లు కారడంతో నల్లగా మారిన పైకప్పు



మరుగుదొడ్ల వద్ద పెచ్చులూడిన పైకప్పు

కొత్త భవనం నిర్మించాలి

'హాస్టల్ భవనం కొత్తది నిర్మిస్తే చాలామంది విద్యార్థులు చేరుతారు. ఈ ఏడాది కొంత మంది విద్యార్థులు చేరాలని వచ్చి భవనం చూసి వెనక్కు వెళ్లిపోయారు. కొత్త భవనం నిర్మిస్తే కళాశాల విద్యార్థులకు కూడా ప్రయోజనం ఉంటుంది.'

● వెంకటేశ్వర రావు, వార్డెన్

తోటల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి



టమోటా పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి శివకుమారి

భాకరాపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టమోటా తోటల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖాధికారి శివకుమారి తెలిపారు. వర్షాల నేపథ్యంలో శుక్రవారం ఆమె చిన్నగొట్టిగల్లులోని టమోటా తోటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. తోటల్లో నీరు తీసేసి త్వరగా ఆరేలా చూడాలని సూచించారు. పొలంలో నీటిని బయటకు తీసేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల మూరేట్ ఆఫ్ పొటాష్(ఎంవోపీ)ను పైపాటు ఎరువులుగా వేయాల న్నారు. ఒరిగిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్లచుట్టూ మట్టిని వేయాలని తెలియజేశారు. కాయలు పగలకుండా ముందు జాగ్రత్తగా లీటరు నీటికి ఒక గ్రాము బోరాక్స్ కలిపి పిచికారి చేయాలన్నారు. కూరగాయల పంటలకు నారుకుళ్లు తెగులు ఆశించకుండా లీటరు నీటికి కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు కలిపి మొదలు తడిచేలా పిచికారి చేయాలన్నారు. ఆకుమచ్చ, కాయకుళ్లు తెగుళ్లు అధికంగా ఉంటే సాఫ్ మందును పిచికారి చేయాలన్నారు. వేరు కుళ్లు ఆశించ కుండా పంటల్లో కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బెండిజం 10 గ్రాములు పది లీటర్ల నీటిలో కలిపి మొక్కలకు పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుందని వివరించారు.

కలుషితమైన 'నది'!

- స్వర్ణముఖిలో చెత్త డంపింగ్
- తాగునీరు కాలుష్యం
- అనారోగ్యం పాలవుతున్న స్థానికులు





స్వర్ణముఖి నదిలో చెత్త వేస్తున్న పంచాయతీ సిబ్బంది, నదిలో పేరుకుపోయిన చెత్త

తిరుచానూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కంచే చేనుమేసినట్లు పారిశుధ్యాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాల్సిన వారే కలుషితం చేస్తున్నారు. డంపింగ్ యార్డులో వేయాల్సిన చెత్తను పంచాయతీ సిబ్బందే స్వర్ణముఖి నదిలో వేయడంతో ఆ ప్రాంతం దుర్గంధంగా మారింది. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇక్కడ పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన సిబ్బంది తూతూ మంత్రంగా చేపడుతున్నారు. ఫలితంగా అమ్మవారి పుణ్య క్షేత్రంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. అదేసమయంలో తిరుచానూరు పంచాయతీలో సేకరించిన చెత్తను పారిశుధ్య సిబ్బంది స్వర్ణముఖి నదీతీరంలో డంపింగ్ చేస్తున్నారు. దీనివల్ల నదిలో నీరు కలుషిత మవుతోంది. అదేవిధంగా రాత్రివేళ ఆకతాయిలు చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఆ పొగకు స్థానికంగా ఉన్న శంకర్ నాయుడుకాలనీ, రామకృష్ణారెడ్డి నగర్, నందన వనం, వైష్ణవినగర్ తదితర ప్రాంతాల ప్రజలు పొగ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శ్వాసకోస సమస్యలున్న వారు మరింత అనారోగ్యం పాలవుతున్నారు. ఇక తాగునీటి బోర్లలోనూ నీరు కలుషితమవుతోంది. ఆ నీరు తాగి స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్తను నదిలో వేయకుండా చూడాలని స్థానికులు, పలువురు భక్తులు కోరుతున్నారు.

వచ్చే నెల 28 నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



అధికారులతో కలిసి పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు. అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి శుక్రవారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. మొదట అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు, నవజీవన్ కంటి ఆస్పత్రి, సమీపంలోని ఖాళీ స్థలం, ఘంటశాల సర్కిల్, హైస్కూల్ పరిసరాలు, పసుపు మండపం, పూడి రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహనసేవలు వీక్షించేలా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల చివరిరోజైన పంచమి తీర్థం నాడు విశేషంగా వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా భక్తులు సేద తీరేందుకు నవజీవన్ కంటి ఆస్పత్రి, హైస్కూల్, గోశాల (పూడి రోడ్డు) వద్ద జర్మన్‌షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, వెలుపలకు వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున తమిళంలో సైన్‌బోర్డులు సిద్ధం చేయాలన్నారు. టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ మాట్లాడుతూ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. తిరుమల నుంచి పసుపు ఊరేగింపు సమయంలో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

అమ్మో.. గంజాయి బ్యాచ్

- రెండు రోజుల ముందు ఓటేరులో పలువురిపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు





ఎంఆర్‌పల్లె స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు, చికిత్స పొందుతున్న ధర్మేంద్ర

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో గంజాయి బ్యాచ్ ఆగడాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీరిని పట్టుకోవడంలో పోలీసులు చొరవ చూపడం లేదన్న విమర్శలున్నాయి. బుధవారం నాటి ఘటనకు సంబంధించి శుక్రవారం రాత్రి బాధితులు ఎంఆర్‌పల్లె పోలీసు స్టేషనుకు చేరుకుని ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై కేసు నమోదైంది. రెండు నెలల క్రితం విజయవాడ నుంచి వస్తూ.. ఇంటికి వెళుతున్న భార్యాభర్తలపై గంజాయి మత్తులో కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అప్పట్లో బాధితుడు.. మల్లంగుంటకు చెందిన చంద్రబాబు ఎంఆర్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదైనా.. నిందితులను పట్టుకోలేదు. దీంతో గంజాయి బ్యాచ్ మరింత బరితెగించింది. బుధవారం ఓటేరు సమీపంలోని శ్రీవారినగర్‌లో రిటైర్డు ఎస్‌ఐ వెంకట్రామరాజు ఇంటిపై ఐదుగురు గంజాయి మత్తులో కర్రలు, రాడ్లతో దాడికి దిగారు. బయటకు వచ్చిన ఆయన గట్టిగా అరుస్తూ తరుముకున్నారు. ఆ తర్వాత శ్రీవారి నగర్‌లో భార్యా, పిల్లలతో కలిసి రిటైర్డు టీటీడీ ఉద్యోగి ధర్మేంద్ర వాకింగ్ చేస్తుండగా అతడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. అపస్మారక స్థితిలో పడిపోయిన ఆయన్ను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఉదయం 11 గంటల సమయంలో ఓటేరులోని రైల్వే ఉద్యోగి వాసుదేవనాయుడు ఇంటి తలుపు కొట్టగా.. ఆయన భార్య చైతన్య తీశారు. ఆమెపైనా దాడికి యత్నించడంతో స్వల్పగాయాలయ్యాయి. ఆమె పక్కన వారికి సమాచారం ఇవ్వగా.. నిందితులు పారిపోయారు. చైతన్య ఇంటి ముందున్న సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులకు అందజేసినట్లు బాధితురాలు తెలిపారు. గంజాయి బ్యాచ్ ఆగడాలు భరించలేక వీరు శుక్రవారం రాత్రి ఎంఆర్‌పల్లె పోలీసు స్టేషన్‌లో సీఐ చిన్నగోవిందును కలసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసుల నమోదుతో సరి

ఓటేరు, మల్లంగుంట, వినాయకనగర్, శ్రీవారి కాలనీ తదితర ప్రాంతాల్లో ఇటీవల గంజాయి, మద్యం తాగి కొందరు హల్‌చల్ చేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు ఐదారు ఘటనలు చోటు చేసుకున్నాయి. వీరి వెనుక ఎంఆర్‌పల్లె స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా పేరున్న వ్యక్తి హస్తం వున్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట గంజాయి బ్యాచ్ దాడిలో తీవ్రంగా గాయపడి పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగక పోవడంతో చంద్రబాబు కుటుంబ సభ్యులు బెంగళూరుకు మకాం మార్చారు. ఇలా ఐదారు కుటుంబాలు ఇతర ప్రాంతలకు వలస వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికైనా గంజాయి బ్యాచ్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గుంతలమయంగా సత్యనారాయణపురం సర్కిల్



తిరుపతి (జీవకోన), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని సత్యనారాయణపురం సర్కిల్ రోడ్డు గుంతలమయంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గుంతలతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలను గమనించలేక ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రిళ్లు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



తీరు మార్చుకోకపోతే చర్యలు

- రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ హెచ్చరిక
- రోగులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశం
- దుకాణాల అద్దె బకాయిలపై ఆగ్రహం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. రెండు నెలలు సమయం ఇస్తున్నామని, తీరు మార్చుకోని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలో శుక్రవారం రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఛైర్మన్ హోదాలో కలెక్టర్, కోఛైర్మన్ హోదాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రుయాలో సమస్యలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సారూ పరిశీలించాలి మీరు' శీర్షికన వచ్చిన కథనం క్లిప్పింగులను ముందు పెట్టుకొని ఒక్కో సమస్యపై అధికారులను వివరణ అడిగారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై తగు చర్యలు చేపట్టాలన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు, సిబ్బందిని ఇంకా ఎందుకు బదిలీ చేయలేదని, దీనిపై తనకు పూర్తి వివరాలు అందించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.



ఆంధ్రజ్యోతి పేపరు క్లిప్పింగ్ చూపిస్తూ అధికారుల వివరణ అడుగుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అద్దె బకాయిల మాటేమిటి..

దుకాణాల అద్దెలు రూ.లక్షల్లో పేరుకున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులను నిలదీశారు. వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రయత్నిస్తున్నామని, నిర్వాహకులకు నోటీసులు సైతం జారీ చేశామని అధికారులు సమాధానమిచ్చారు. తక్షణమే బకాయిలపై దృష్టి సారించాలని, అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గడువు ముగిసిన దుకాణాలను ఖాళీ చేయించి, అద్దె పెంచి కొత్త టెండర్లు పిలవాలని ఆదేశించారు.

మందుల కొరత ఎందుకు వస్తోంది..

కావాల్సిన మందులు ప్రభుత్వం సరఫరా చేస్తున్నా ఆస్పత్రి ఆవరణలో జనరిక్ మందుల దుకాణం ఎందుకని ప్రశ్నించారు. మందుల కోసం బయటకు వెళ్లాల్సి వస్తోందని తరచూ రోగులు ఫిర్యాదులు చేస్తున్నారని, దీనిపై దృష్టి పెట్టాలని సూపరింటెండెంట్ రవిప్రభును ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించకుండా చూడాలన్నారు.

ఈ-ఆస్పత్రి ఎందుకు అమలు కావడం లేదు..

ఈ-ఆస్పత్రి అమలుకాకపోవడంపై అధికారులను నిలదీశారు. పక్క జిల్లాలో పక్కాగా అమలవుతుంటే ఇక్కడ ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎక్స్‌రే రిపోర్టులు ఫోన్లలో, ల్యాబ్ రిపోర్టులు కాగితాల్లో రాసివ్వడం ఏంటని మండిపడ్డారు. వెంటనే ఈ-ఆస్పత్రి విధానాన్ని పాటించాలని ఆదేశించారు. గతంలో మాదిరిగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో, ఆస్పత్రి అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఇంటిదోవ తప్పదని హెచ్చరించారు. గత నెలలో నిర్వహించిన సమావేశంలో తీర్మానాల పరిస్థితిపై ఆరా తీశారు. డాక్టర్ల వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే శ్రీనివాసులు

పలు అంశాలకు ఆమోదం..

ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌ల దగ్గర రూ.3.80 లక్షలతో నాలుగు ఆర్వో ప్లాంట్లు, ఆస్పత్రి పరిసరాల్లో అవసరమైన చోట్ల 11 సీసీ కెమెరాలు, చిన్న పిల్లల విభాగంలో పది ఏసీల కొనుగోలుకు ఆమోదించారు. ఆస్పత్రి ఆవరణలో ఏపీఎంఐసీడీసీ అధికారులు గుర్తించిన ఖాళీ స్థలంలో గిరిజన ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఆమోదం తెలిపారు. ఆస్పత్రిలోని పలు వార్డుల మరమ్మతులకు, నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రోగులను వార్డులకు తీసుకువెళ్లేందుకు అద్దె అంబులెన్సు వాహనాన్ని సమకూర్చుకోవాలన్నారు. డిసెంబరు 25 పైన కమిటీ సమావేశం ఉంటుందని, అప్పటి లోపు ఈ నిర్ణయాలు అమలు చేయాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్ మౌర్య, లక్ష్మీపతి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, డీఎంహెచ్‌వో శ్రీహరి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభ, పార్థసారథిరెడ్డి, ఏపీఎంఐసీడీసీ ఈఈ శివరామిరెడ్డి, ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

సిగరెట్లు అప్పు ఇవ్వలేదని..
దుకాణంపై వైసీపీ నేత దాడి

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిగరెట్లు అప్పు ఇవ్వలేదని దుకాణంపై వైసీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చెన్నారెడ్డికాలనీలో చోటుచేసుకుంది. దుకాణ యజమాని వివరాల మేరకు.. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్గయ్య చెన్నారెడ్డికాలనీలో దుకాణం నడుపుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నేత సతీష్ ఈ దుకాణం వద్దే కావాల్సిన సరుకులు తీసుకునేవాడు. శుక్రవారం రాత్రి వచ్చి సిగరెట్లు అప్పు కావాలని అడిగాడు. జగ్గయ్య నిరాకరించడంతో రెచ్చిపోయిన సతీష్ దుకాణంపై దాడి చేశాడు. చాలావరకు వస్తువులు దెబ్బతిన్నాయి. ఘటనపై జగ్గయ్య అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.50వేల వరకు నష్టం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మట్టి తీసి వదిలేశారు..



పిల్లర్ 64 వద్ద తీసిన గుంత

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లీలామహల్ సమీపంలో శ్రీనివాససేతు పిల్లర్ నెంబరు 64 వద్ద నిర్మాణానికి కొన్ని రోజుల క్రితం మట్టి తీసి వదిలేశారు.గుంతపై స్లాబు ఏర్పాటుకు కమ్మీలను సైతం ఉంచారు. వర్షాలకు గుంత పొంగి మట్టి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అందించని నెట్‌వర్క్ ఆస్పత్రులపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీఎన్జీవోస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఎస్వీ వైద్య కళాశాలలో శుక్రవారం హెచ్‌డీఎస కమిటీ సమావేశానికి హాజరైన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా అనుమతి పొందిన ఉద్యోగులకు, పెన్షనర్లకు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించడం లేదని, ఇష్టానుసారంగా నగదు వసూలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

అసంపూర్తిగా స్లాబ్ నిర్మాణం

- రోడ్డులోనే వదిలేసిన ఇనుప కమ్మీలు, బండలు



అసంపూర్తిగా వదిలేసిన కాలువ స్లాబ్ నిర్మాణం

తిరుపతి (జీవకోన), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-కరకంబాడి రోడ్డు లో ఇరువైపులా నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రధానంగా వరద నీరు వెళ్లేందుకు ఈ కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టింది. గత కొన్నేళ్ల నుంచి కాలువ నిర్మాణ పనులను తూతూమంత్రంగా చేపడుతున్నారు. తిరుపతి నుంచి కరకంబాడి వైపు వెళ్లే మార్గంలో కాలువ నిర్మాణ పనులు దాదాపు పూర్తవగా, తిరుపతి నగరం వైపు వెళ్లే మార్గంలో మాత్రం పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కాలువ పనులు పూర్తయిన చోట స్లాబుల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో పాటు, పనులకు సంబంధించి మెటీరియల్‌ను సైతం రోడ్లపక్కనే వదిలేశారు. స్లాబుల నిర్మాణం కోసం ఇనుప కమ్మీలను ఏర్పాటు చేసినప్పటికీ ఆ పనులను అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

ఈస్ట్ స్టేషన్‌కు సిబ్బంది కొరత

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ చాలా కీలకం. మంత్రులు, ఇతరత్రా అధికారులకు ప్రొటోకాల్ చూడాల్సిన బాధ్యత ఈ స్టేషన్‌పైనే ఉంది. ఈ స్టేషన్‌కు గతంలో ఆరుగురు ఎస్‌ఐలు ఉండేవారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో ఇక్కడి వారిని ఇతర స్టేషన్లకు బదిలీ చేశారు. ఖాళీలను అలాగే వదిలేశారు. ఇటు ఆర్టీసీ బస్టాండు, అటు రైల్వే స్టేషన్, టీటీడీ వసతి సముదాయాలు, సినిమా థియేటర్లు, మాల్స్ పెద్ద పెద్ద హోటళ్లు, ఇతర షాపింగ్ మాల్స్ ఉండడంతో కేసులు ఎక్కువగా వస్తుంటాయి. తిరుపతి రూరల్, చంద్రగిరి, తిరుచానూరు, శ్రీకాళహస్తి వంటి స్టేషన్లలోనూ ముగ్గురు నుంచి నలుగురు ఎస్‌ఐలు పనిచేస్తున్నారు. తక్కువగా కేసులు నమోదవుతున్న వెస్ట్ స్టేషన్‌లోనూ ముగ్గురు ఎస్‌ఐలు ఉన్నారు. ఈస్ట్‌లో మాత్రం నరసింహులు ఎస్‌ఐ మాత్రమే ఉన్నారు. ఒకరిపైనే పనిభారం పడడంతో బాధితులకు సరైన న్యాయం అందని పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

సప్లై ఛానల్స్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శివారెడ్డి, ప్రభు

తిరుపతి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం స్వర్ణముఖి నది నుంచి సి.మల్లవరం గ్రామ పంచాయతీ మీదుగా పాతకాల్వ చెరువుకు నీరు వచ్చే ప్రధాన సప్లై ఛానల్స్ ఆక్రమణకు గురయ్యాయని, వీటిని సర్వే చేసి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని పాతకాల్వ గ్రామస్తులు శివారెడ్డి, ప్రభు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రూరల్ తహసీల్దార్ బి.రామాంజులునాయక్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ స్వర్ణముఖి నది నుంచి ఈ సప్లై ఛానల్స్ ద్వారా మండలంలోని పాతకాల్వ, గొల్లపల్లె, రామానుజపల్లె, తుమ్మలగుంట తదితర పది చెరువులకు నీరు చేరేదని, సర్వే నంబర్లు 23, 27, 28,30, 37, 39, 41, 45లలో ఆక్రమణకు గురవ్వడంతో నీరు వచ్చే ఛానల్స్ బంద్ అయినట్లు వివరించారు. అలాగే ఈ విషయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా తగు చర్యలు చేపడతామని తెలిపారన్నారు.

రేపు గాండ్ల తెలికుల వివాహ పరిచయ వేదిక

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శ్రీపద్మావతి కన్వెన్షన్‌లో ఆదివారం అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం తిరుపతి ఆధ్వర్యంలో గాండ్ల తెలికుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నేతలు శాకం ప్రభాకర్, చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి 350 మందికి పైగా గాండ్ల కులస్థులు పాల్గొంటారన్నారు. బయోడేటాతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు.

నేడు కలాం జయంతి వేడుకలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మహతి కళాక్షేత్రంలో శనివారం నిర్వహిస్తున్నట్లు కలాం ట్రస్టు సభ్యులు సిరివెళ్ల బాషా, హేమంత్, శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరవుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏటీఎంలో చోరీ యత్నం

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంను పగులకొట్టి చోరీకి ప్రయత్నించిన ఘటన తిరుపతి రూరల్ చెర్లోపల్లి జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎమ్మార్‌పల్లి సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. అర్ధరాత్రి చంద్రగిరి-ఎస్వీయూ ప్రధాన రహదారి పక్కన ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న హిటాచ్చి ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టడానికి ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా అది తెరుచుకోకపోవడం, ఆ సమయంలో చుట్టుపక్కల ఏదో అలికిడి కావడంతో పారిపోయారు. ఏటీఎం సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మార్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి టౌన్ ఈఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీ కాలనీ, ఇస్కాన్ టెంపుల్, యశోదనగర్, సప్తగిరినగర్, రైల్వే కాలనీ, గాంధీరోడ్డు, న్యూబాలాజీ కాలనీ, ఎల్ఎస్ నగర్, టాటా నగర్, పెద్దకాపు లేఅవుట్, తిరుచానూరు, రూరల్ మండలంలో పలు గ్రామాలు, కొర్లగుంట, ఆర్సీ రోడ్డు, వీవీ మహల్, లీలామహల్, ఆర్సీ రోడ్డు, మంగళం, దామినేడు, చిగురువాడ, దామినేడు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సాధికారత కోసం మహిళలే సంసిద్ధులు కావాలి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ఉమా

తిరుపతిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన అభివృద్ధి, సమ్మిళిత పాలన సాధించడానికి మహిళలు ముందంజలో ఉండాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.ఉమా తెలిపారు. భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో మహిళా సాధికారిత-పాలనా నిర్ణయాధికారంలో భాగస్వామ్యం అనే అంశంపై రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మహిళా సాధికారిత విజయవంతం కావాలంటే నాయకత్వ లక్షణాలు, పాలనా నిర్ణయాల్లో చొరవ, ఇతర విషయాల్లో పరిజ్ఞానం సాధించాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్థిక, సాంఘిక శాస్త్రాల అధ్యయన కేంద్రం సీనియర్ కన్సల్టెంట్ ఎం.గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి సాధికారత ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. పలు వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు వివిధ అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. అగ్రశ్రీ సంచాలకులు, సదస్సు కన్వీనర్ డాక్టర్ డి.సుందరరామ్ పాల్గొన్నారు.

రూ.3.92కోట్లతో అభివృద్ధి పనులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.3.92కోట్లతో తిరుపతి రూరల్ మండలంలో అభివృద్ధి పనులకు ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి మంగళం పరిధిలోని తిరుమలనగర్, మంగళం క్వార్టర్స్, రణధీరపురం, సప్తగిరినగర్‌లతో పాటు మూడు పంచాయతీలలో 47 మురికి కాలువలు నిర్మించనున్నారు.

25వ ఏప్రిలియా ఆర్ఎస్ 457 డెలివరీ



పునీత్‌కృష్ణకు తాళం అందిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని ప్రీమియం షోరూంలో పియాజియో ఇండియా 25వ ఏప్రిలియా ఆర్ఎస్ 457ను డెలివరీ చేశారు. కందాల పునీత్‌కృష్ణ ఏప్రిలియా ఇండియా స్పోర్ట్స్ బైక్ అందుకుని రేసింగ్ కమ్యూనిటీలో చేరారు. నికీ మోటార్స్ సీఈవో నాగభూషణరెడ్డితో కలసి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు అందజేశారు. దీని ధర రూ.4.11లక్షలని సీఈవో తెలిపారు.



మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు

తిరుపతి(లీలామహల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లీలామహల్ - కపిలతీర్థం మార్గంలోని అలిపిరి పోలీస్‌స్టేషన్ ఎదుట మ్యాన్‌హోల్ మూతలు ప్రమాదకరంగా ఉన్న విషయమై శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టి నూతన మూతలు ఏర్పాటు చేయడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉప సర్పంచ్‌లకు శిక్షణ

తిరుపతి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉప సర్పంచ్‌లకు పంచాయతీ వ్యవహారాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ వేముల యశోద, ఎంపీడీవో రామచంద్ర, విస్తరణాధికారి మాధురి, 34పంచాయతీలకు చెందిన ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్



తిరుపతి (జీవకోన), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోన వద్ద జీవలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై పెద్ద వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. తద్వారా ఆలయం నుంచి వచ్చే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రణధీరపురంలో తాగునీటి సమస్య



తిరుపతి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శివారు ప్రాంతమైన కరకంబాడి రోడ్డు సప్తగిరికాలనీ, రణధీరపురం పంచాయతీల పరిధిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చే హామీలు మాటలకే పరిమితమవుతున్నాయి. మూడు దశాబ్దాల క్రితం మంగళం పరిధిలో సప్తగిరికాలనీ, రణధీరపురం పంచాయతీలు వెలశాయి. దాదాపు 6వేల నివాసాలు ఉన్నాయి. ప్రజల సౌకర్యార్థం అప్పట్లోనే నాలుగు బోర్లు వేశారు. అన్నింటిలో నీరు పుష్కలంగా లభిస్తోంది. మూడు భారీ నీటి ట్యాంకులను సైతం నిర్మించారు. ప్రతిరోజూ ట్యాంకులకు నింపుతున్నా ఎనిమిది రోజులకొకసారి మాత్రమే కొళాయిలకు సరఫరా చేస్తున్నారు. ఇళ్లలో నిల్వ చేసుకున్న నీరు నాలుగు రోజులుకే అయిపోతుండడంతో మిగిలిన నాలుగు రోజులు అవస్థలు తప్పడం లేదు. ఇతర లైన్లకు సరఫరా చేసే సమయంలో అక్కడికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ఇటీవల జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్‌కు సమస్యపై వినతిపత్రం ఇచ్చామని, దాని గురించి పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు. తెలుగు గంగ నీటిని సరఫరా చేస్తామన్న హామీని పూర్తిగా పక్కనపెట్టేశారని అంటున్నారు. ఈ సమస్యపై అధికారులు, నాయకులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

పక్క కాలనీలో రోజూ నీరు సరఫరా



తమకు పక్కనే ఉన్న అంబేడ్కర్ కాలనీలో ప్రతిరోజూ నీరు సరఫరా చేస్తారు. రణధీరపురంలో మాత్రం పది రోజులకొసారి వదులుతారు. అన్ని రోజులు నీరు లేకుండా ఎలా గడపాలి. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. మోటరు కాలిపోయింది, పైపులు పగిలిపోయాయంటూ సాకులు చెబుతున్నారు. సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం చూపాలి.

బిందెల బరువు మోయలేకున్నాం



సకాలంలో తాగు నీరు వదలకపోవడంతో దూరంగా ఉన్న వీధి కొళాయిల నుంచి బిందెలతో మోయలేకున్నాం. వయస్సు మళ్లిన మాలాంటి ముసలివాళ్లు ఎలా బతకాలి. పంచాయతీ అధికారులకు చెప్పినా స్పందన లేదు. ఎన్నాళ్లు ఇలా గడపాలి. తక్షణమే చర్యలు చేపట్టాలి.



పండగ సెలవు కోసం..

నరక చతుర్దశిని అధికారిక సెలవుదినంగా ప్రకటించాలన్నది ఈ విద్యార్థుల వినతి. దీనికోసం తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె సర్కిల్‌లో శుక్రవారం సాయంత్రం పోస్టుకార్డులను చూపారు. వీటిని సీఎం చంద్రబాబుకు పంపనున్నట్లు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల తెలిపారు. గత వైసీపీ పాలనలో హిందూ వ్యతిరేకతతో పండుగ సెలవును రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ సెలవును పునరుద్ధరించాలని కోరారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

ఎలా పోవాలబ్బా?

వాహనం వస్తే దిగబడుతుంది. ద్విచక్ర వాహనమైతే జారుతుంది. ఇలాంటి రోడ్డులో ఎలా పోవాలబ్బా అంటూ ఆవేదన చెందుతున్నారు ఏర్పేడు మండలం పాగాలి గ్రామస్తులు. శ్రీకాళహస్తి రోడ్డులో నుంచి ఆ ఊరు వెళ్లే 2.5 కిలోమీటర్లు ఇదే పరిస్థితి. 2019కి ముందు టీడీపీ హయాంలో రోడ్డుకు భూమి పూజ చేసినా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. దీంతో వర్షమొస్తే నడకయాతన తప్పడం లేదంటున్నారు స్థానికులు.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి





బాక్స్ క్రికెట్! కుమ్మేసుకోవచ్చు

గేమ్స్ అంటే ఈతరం పిల్లలు మొబైల్‌లో ఆడుకునేవి అనుకుంటారు. ప్రభుత్వ బడుల్లో మైదానాలు అంతరించిపోయి, ఆటస్థలాలు లేని ప్రయివేటు బడుల హవా మొదలయ్యాక ఏర్పడిన దౌర్భాగ్యం ఇది. గుడ్డిలో మెల్లలా క్రికెట్ ఆట ఒక్కటీ ఈతరం పిల్లలను ఆకర్షిస్తూనే ఉంది. ఆసక్తి ఉన్నా, సమయం కుదుర్చుకున్నా ఆడుకునేదానికి స్థలాలు ఏవీ? రియల్‌ఎస్టేట్ కబళించేసిన నగరాల్లో ఇదో పెద్ద సమస్య. ఇందుకు విరుగుడుగా పరిమిత స్థలంలోనే క్రికెట్ ఆడుకునే, నేర్చుకునే మైదానాలు మొదలయ్యాయి. వీన్నే బాక్స్ క్రికెట్ అంటున్నారు. తిరుపతిలో ఆరు బాక్స్‌క్రికెట్ క్లబ్‌లు ఉన్నాయి. గంటకి ఇంతని అద్దె చెల్లించి వీటిలో ఆడుకోవచ్చు. గెస్ట్‌లైన్‌రోడ్డు(అన్నమ్య మార్గ్)లో కొత్తగా సామ్స్ క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లో 2 క్రికెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. యువత టీంలుగా గానీ, కుటుంబాలుగా గానీ ఆడుకోవచ్చు. కాకపోతే ముందుగా టైంస్లాట్ బుక్ చేసుకోవాలి.

- తిరుపతి (జీవకోన)



ప్రత్యేకతలు:

ఈడ్చి కొడితే బాల్ పక్కింటి కిటికీ అద్దాలు బద్దలు చేస్తుందనే భయం లేదు. బాక్స్‌లైవ్ నెట్ బాల్‌ను బయటకు వెళ్లనివ్వదు.

రాత్రి వేళల్లోనూ ప్రత్యేక లైట్ల వెలుగులో క్రికెట్ ఆడుకోవచ్చు.



అద్దె ఎంత?:

పగలైతే గంటకు రూ.650.
రాత్రి అయితే రూ.850.
(15శాతం దాకా డిస్కౌంట్ వెసులుబాటు ఉంది)
వివరాలకు: 9059268386



ముగింపు దశలో ముక్కంటి ఆలయ లీకేజీ పనులు

● దాతృత్వం చాటుకున్న పుణె వ్యాపారి



శ్రీకాళహస్తి, అక్టోబరు 18: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు లీకేజీని అరికట్టే పనులు ముగింపు దశగా వచ్చాయి. కొద్ది సంవత్సరాలుగా ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ ఏర్పడటంతో సమస్య నెలకొంది. మైసూరులోని జాతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ముక్కంటి ఆలయ లీకేజీలపై స్పందించారు. పుణెకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు వెంకటేశ్వరరావును లీకేజీ పనులను చేపట్టాల్సిందిగా సూచించారు. దీంతో ఏడాది క్రితం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పుణెకు చెందిన ఐఐటీ నిపుణుల బృందంతో పలుదఫాలుగా అధ్యయనం చేయించారు. అత్యంత శాస్త్రీయమైన పురాతన శైలిలో పైకప్పునకు మరమ్మతులు చేసేందుకు రెండు నెలల క్రితం దాత పనులు ప్రారంభించారు. నిపుణుల పర్యవేక్షణలో సున్నం, ఇటుకలపొడి, ఇటుక ముక్కలు, ప్రకృతిలో సహజసిద్ధంగా మొక్కల నుంచి సేకరించిన బంక, కరక్కాయపొడి తదితర మిశ్రమాలతో పనులు చేపట్టారు. సుమారు రూ.5కోట్లతో చేపట్టిన ఈ పనులు తుదిదశకు చేరాయి. ఆయన కృషి ఫలితంగా ఇటీవల నాలుగు రోజుల పాటు ఎడతెరపిలేకుండా వర్షాలు కురిసినప్పటికీ ఎక్కడా లీకేజీ కనపడలేదు.



పంచాయతీ పరిధిలో జీప్లస్ టూ వరకే నిర్మించాలి. ఆపై కట్టాలంటే తుడా అనుమతి తీసుకోవాలి. అలాగని ఈ ప్రాంతంలో భవంతుల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే.. తుడా అనుమతివ్వదు. ఎందుకంటే ఇది హథీరాంజీ మఠం భూములు. అయినా, నిబంధనలకు విరుద్ధంగా తిరపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ తిరుమలనగర్‌లోని మఠం భూముల్లో కళ్లు చెదిరే బహుళ అంతస్థు నిర్మాణాలు చేపడుతున్నారు.

మఠం భూముల్లో బహుళ అంతస్థులు

● నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు



గాంధీపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 13 లో దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో మఠం భూమిఉంది. ఈ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ తరహా పలు అపార్టుమెంట్లు, పెద్దపెద్ద నివాస భవంతులను నిర్మిస్తున్నారు. గతంలో ఈ భూమిని పలువురు రైతులు మఠం నుంచి 99 సంవత్సరాలకు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగుచేసేవారు. తమకు సాగు అనుభవం ఉండడంతో అప్పట్లో కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించి రిజిస్ట్రేషన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తర్వాతకాలంలో హైకోర్టు ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టకుండా ఉత్తర్వులను రద్దు చేసినట్లు సమాచారం. ఈసీలో కూడా ఇప్పటికీ హథీరాంజీమఠం భూమిగానే నమోదై ఉంది. ఈ స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టేందుకు పంచాయతీకి అనుమతిచ్చే అధికారం లేదు. అయితే నీరు, లైట్లు, రోడ్లు పంచాయతీవి కావడంతో కొంత మంది నుంచి గతంలో డెవలప్‌మెంట్ ట్యాక్స్ కట్టించుకున్నట్లు తెలిసింది. ఈ భూమిలో తొలుత రేకులషెడ్లు నిర్మించుకున్న కొందరు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడితో ఒత్తిడి తెచ్చి పంచాయతీ డెవలప్‌మెంట్ ట్యాక్స్‌తోపాటు విద్యుత్ మీటర్లనూ తీసుకున్నారని సమాచారం. అదే స్థలంలో పెద్ద భవంతులు నిర్మించాక నాలుగేళ్లుగా ఎటువంటి రివైజ్డ్ ట్యాక్స్ కూడా చెల్లించని పరిస్థితి ఉంది. ఇప్పటికీ ట్యాక్స్ రూపంలో పలువురు వేలాదిరూపాయలు బకాయి ఉన్నారు. దీనికి తోడు కొత్తగా చేపట్టిన దాదాపు 40శాతం వరకు నిర్మాణాలకు ఇప్పటికీ పూర్తిగా పంచాయతీ ట్యాక్స్ కూడా చెల్లించలేదని తెలిసింది. తిరుపతినగరపరిధి దాదాపుగా రూరల్‌మండలం వరకు విస్తరించడంతో ఈభూములకు విపరీతమైన డిమాండు ఉంది. దీంతో రైతులు మఠం వద్ద కౌలుకు తీసుకున్న ఈ భూములను పలువురికి విక్రయాలు చేపట్టారు. రైతుల నుంచి పలువురు ఈభూములను కొనుగోళు చేసి భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. మఠం భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాల అప్రూవల్‌కు అవకాశమే లేదు. అయితే ఈభూమిలో వివిధ రంగాలకు(రాజకీయ, రెవెన్యూ, పోలీసు తదితర) చెందిన వారు నిర్మాణాలు చేపట్టడంతో మఠం, పంచాయతీ అధికారులు ఇటువైపు చూడటం లేదు. అదే పేదలు ఎక్కడో మారుమూల రెండుసెంట్ల స్థలం కొనుగోళు చేసి నిర్మాణాలు చేపడితే వెంటనే వచ్చి కూలదోసే మఠం అధికారులు విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆపార్టీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నేతల కన్ను ఈభూమిపై పడింది. ఇతరుల అధీనంలో ఉన్నభూమిలో దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమణలకు దిగుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

'పులికాట్'లో ఒరిగిన టవర్



నిటారుగా నిలబడాల్సి ఈ విద్యుత్తు టవర్.. ఏడాది ఒరిగిపోయి ఉంది. ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కోసం పులికాట్ సరస్సులో రెండు టవర్ల ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి గతేడాది మిచౌంగ్ తుఫాన్ సమయంలో వీచిన గాలులకు పక్కకు ఒరిగిపోయింది. అప్పట్నుంచి అలా.. ఉండిపోయింది. ఇటీవల వాయుగుండం ముప్పు తప్పింది కాని.. పెనుగాలులు వీచుంటే ఈ టవర్ నేలవాలేదే. ఇప్పుడు వానలు.. తుఫాన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో విద్యుత్తు టవరు కిందకు ఒరిగిపోతే ప్రమాదమే. మరోవైపు ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కూడా నిలిచిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ టవర్‌ను స్థిరంగా నిలబెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- తడ, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

తిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.96 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక గురువారం 58,637 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.



సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ ఛార్జీలు పెంచకండి

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు నెపంతో విద్యుత్ చార్జీలు పెంచరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు పెంచి, ఆ భారాన్ని వినియోగదారులపై మోపాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 వార్షికానికి సంబంధించి సర్దుబాటు చార్జీలు పెంచాలని విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆ సమయంలో ప్రజాభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వినియోగదారుల ప్రయోజనాలు కాపాడాల్సిన నియంత్రణ మండలి నేటి వరకు కాలయాపన చేసి ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకోవడం ఏమిటని నిలదీశారు. తొందరపాటు చర్యలతో వినియోగదారులపై భారం మోపాలని చూస్తే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, నరేంద్ర, చిన్నబాబు పాల్గొన్నారు.

మద్యం షాపుల యజమానులెవరు?



కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

● వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల యజమానుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. జిల్లాలో 227 మద్యం దుకాణాలకు గాను శుక్రవారం వరకు దాదాపు 210 ప్రారంభమయ్యాయి. ఆయా మద్యం షాపులను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు? వాటి యజమానులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారు? వారి ఆధార్ వివరాలు.. గతంలో పోలీసు కేసులు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో ఉంచి అవసరమైన సమయాల్లో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే దానికి సంబంధిత దుకాణాలు యజమానులను బాధ్యులుగా చేయడానికి అవకాశం వుంటుందని పోలీసులు చెబుతున్నారు. అన్ని మద్యం దుకాణాలను సంబంధిత పోలీసు స్టేషన్లతో అనుసంధానం చేసే ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నారు.



ఓంకార్, అశ్విన్

స్క్రిప్టులో 'రాజుగారి గది 4'

'రాజు గారి గది4' సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని దర్శకుడు ఓంకార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం తన తమ్ముడు, హీరో అశ్విన్‌తో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఇస్మార్ట్ జోడీ3', 'డ్యాన్స్ ఐకాన్2' షోలు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాను నటించిన ఓ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తామని అశ్విన్ చెప్పారు.



శ్రీవారి సేవలో అషిక

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సినీనటి అషిక రంగనాథ్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆమె స్వామి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి: కురుగొండ్ల


మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోరు 18:(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన రామకృష్ణ పలువురు మంత్రులను కలిశారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడులో రూ.540 కోట్ల వ్యయంతో ప్రారంభించిన రిజర్వాయరు నిర్మాణ పనులను తిరిగి పునరుద్ధించాలని కోరారు. రిజర్వాయరు నిర్మాణంలో 120 ఎకరాలు అటవీ భూములు కలుస్తున్నాయని, అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ భూములు కేటాయింపు జరగాలని మంత్రి అనగానిని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో అటవీ పోరంబోకు, రెవెన్యూ భూములు విస్తారంగా వున్నాయని, వాటిని గుర్తించి పరిశ్రమల స్థాపనకు రిజర్వు చేయాలని కోరారు. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడికి కురుగొండ్ల విజ్ఞప్తి చేశారు.

లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గర్భస్థపిండ లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ తన కార్యాలయంలో గర్భస్థపిండ లింగనిర్ధారణ చట్టం అమలుపై అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనన్నారు. ఆడపిల్లల పట్ల వివక్షత చూపడకూడన్నారు. గర్భస్థపిండ లింగనిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణహత్యలను నివారించవచ్చునన్నారు. వైద్యాధికారులు ప్రతినెలా స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి చట్టాన్ని అతిక్రమించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో కూడా ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, బాబు నెహ్రూరెడ్డి, మెహబూబీ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక అమరావతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరిచయం వ్యక్తులు వోటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. మొబైల్ పాస్‌వర్డు గోప్యంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయ ఎలక్ట్రీషియన్ మృతి


తంగరాజు

పిచ్చాటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితో పంచాయతీ కార్యాలయ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. తంగరాజు (36)కు గురువారం రాత్రి కడుపునొప్పి రావడంతో నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నగరి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా డాక్టర్లు సూచించారు. కుటుంబీకులు నగరి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. కాగా తంగరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పిచ్చాటూరు సర్పంచు రోసిరెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైసీపీ నాయకుడు హరిశ్చంద్రారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

కాలువను మళ్లించండి

వరదయ్యపాళెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలువను మళ్లించాలని రైతు మునిచంద్రారెడ్డి కోరుతున్నాడు. మండలంలోని అంబూరు వద్ద టీజీపీ ప్రాజెక్టు 9ఎల్ 8బి బ్రాంచ్ కెనాల్ ప్రాజెక్టు పనులు తన పొలం వద్ద ఆగిపోయాయన్నారు. దీని వలన తాను 20 సంవత్సరాలుగా వర్షాకాలంలో వ్యవయసాయంలో తీవ్ర నష్టం చవిచూస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో ఈ కాలువ వలన ఎవరికి ఉపయోగం లేదన్నారు. అధికారులు వేరే ప్రాంతానికి మళ్లించాలని కోరారు.

ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు రెండురోజుల శిక్షణ

వరదయ్యపాళెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, ఈవోపీఆర్డీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం


విద్యార్థినిని సత్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

దొరవారిసత్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వి.నిరోషా గత నెలలో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ ఇన్‌స్పైయర్ మనక్‌లో ప్రతిభ కనబరిచింది. నిరోషా తయారు చేసిన ట్రాలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్ యంత్రం ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. శుక్రవారం ఎంఈవో కృష్ణయ్య ఉపాధ్యాయులతో కలిసి నిరోషాను సత్కరించారు. భవిష్యత్‌లో మంచి శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

గూడూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నట్టలనివారణ కార్యక్ర మాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ సురేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని కొండాగుంట గ్రామంలో గొర్రెలకు, మేకలకు నట్టలనివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

మానమాలలో గ్రామసభ

ఓజిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మానమాలలో శుక్రవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై స్థానికులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయకుమార్, సర్వేయర్ లక్ష్మీనారాయణ వీఆర్వో మస్తాయ్య, టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

డీకేటీ భూములకు పరిహారం ఇవ్వండి

కోట,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డీకేటీ భూములకు పరిహారం చెల్లించే విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మండలంలోని కొత్తపట్నం పంచాయతీ గున్నంపడియ రైతులు శుక్రవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. కొత్తపట్నం రెవెన్యూలోని డీకేటీ భూములను ఏపీఐఐసీ సెజ్‌కు తీసుకున్నందున పరిహారం అందించాలని కోరారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయురాలు భార్గవి ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసనలో ఐదు రకాల లోపాలు ఉంటాయని, వాటిని ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, భవిత కేంద్ర సిబ్బంది సాయి సంధ్య, సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22నుంచి 25 వరకు ఆధార్ క్యాంపులు

గూడూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నరసింగరావుపేట, మాళవ్యా నగర్, ఇందిరానగర్, చెన్నూరు సచివాలయాల్లో ఆధార్‌కార్డుల సవరణ, నూతన కార్డుల జారీకి ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమ్మెకు పిలుపు

ఓజిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఈనెల 29 నుంచి సమ్మెకు పిలుపునిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సుమన్ శుక్రవారం తెలిపారు.



సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా కడతూము వద్ద చేపట్టిన ఫ్లైఓవర్ - కడతూము వద్ద పూడిపోయి రూపురేఖలు మారిన పంటకాలువ

సాగరమాల రోడ్డు నిర్మాణంతో
పూడిపోతున్న పంటకాలువలు

- ప్రశ్నార్థకంగా మారనున్న సాగు
- ఆందోళన చెందుతున్న రైతులు

చిల్లకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో వరగలిక్రాస్ రోడ్డు నుంచి తమ్మినపట్నం వరకు సుమారు 40 కిలోమీటర్ల మేర సాగరమాల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా వరగలి క్రాస్ రోడ్డు నుంచి సమీపంలోని పెట్రోల బంకు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతోంది. దీని వల్ల సమీపంలోని కడతూముతో పాటు పంట పొలాలకు సాగునీరు అందించే పంట కాలువ పూడిపోయింది. కడతూము కింద సుమారు 160 ఎకరాల వరకు చిల్లకూరు రైతులు సాగు చేస్తున్నారు. చిల్లకూరు చెరువు నుంచి పంట కాలువ ద్వారా కడతూము నుంచి జాతీయ రహదారి సమీపంలోని పొలాలకు సాగు నీరు చేరుతుంది. అయితే సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా వరగలి క్రాస్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ వల్ల కడతూము నుంచి వచ్చే పంటకాలువ పూర్తిగా పూడిపోగా, కడ తూము కొంతమేర పూడిపోయింది. జాతీయ రహదారి నిర్మాణం చేపట్టిన సమయంలో పొలాలకు సాగుకు నీరు వెళ్లడానికి ఇబ్బందులు కలగ కుండా కడతూము వద్ద కల్వర్టు ఏర్పాటు చేసి దానిపై రోడ్డు నిర్మించారు. అయితే సాగరమాల వంతెన పనులు చేసే సమయంలో మట్టి తోలకం వల్ల కడతూము కొంతమేర పూడిపోయింది. అక్కడి నుంచి వచ్చే పంటకాలువ పూడిపోయి రూపురేఖలు లేకుండా పోయింది. ప్రస్తుతం వర్షాలు కురు స్తున్నా.. పంటకాలువ పూడిపోవడంతో నీటి ప్రవాహం లేక సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.




మేనేజరు, టౌన్ ప్లానింగ్ అధికారి, జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

వెంకటగిరి మున్సిపాలిటీలో
గాడితప్పిన పాలన..!

- సెలవులో కమిషనర్
- క్యాంపు పేరుతో విధులకు సిబ్బంది డుమ్మా
- కార్యాలయంలో అన్నీ ఖాళీ కుర్చీలే
- ప్రజలకు సమాధానం చెప్పేవారు కరువు



మున్సిపల్ కార్యాలయం - ఖాళీగా వున్న కమిషనర్ సీటు

వెంకటగిరి, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో పాలన గాడి తప్పింది. ఇటీవల మున్సిపల్ కమిషనర్ బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన కమిషనర్ నరేంద్ర విధుల్లో చేరిన వెంటనే సెలవుపై వెళ్లడంతో పాలన పడకేసింది. అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియడం లేదు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ మొదలుకొని వార్డు కౌన్సిలర్లు మొత్తం వైసీపీకి చెందిన వారు కావడంతో వారు పాలనపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో అక్కడి అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సిబ్బంది ప్రతి పనికీ ఓ రేటు కట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న పని కావాలన్నా రోజుల తరబడి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారని ఆరోపిస్తున్నారు. పట్టణంలో అక్రమ లే అవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకొనే నాధుడు కరువయ్యారు. టౌన్ ప్లానింగ్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో పట్టణంలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే పారిశుధ్య బాధ్యతలు చూస్తున్న ఓ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే తరహాలో వెంకటగిరి పోలేరమ్మ జాతర ఖర్చుల పేరుతో లక్షలాది రూపాయల సొమ్ము దారి మళ్లించారే ఆరోపణలు ఉన్నాయి. కమిషనర్ సెలవులో వుండటం కొంతమంది అధికారులకు బాగా కలిసి వచ్చిందని కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో మొత్తం 34 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తుంగా కేవలం 16 మంది మాత్రమే పని చేస్తున్నారు. అధికారులు కార్యాలయం విడిచి వెళ్లాలంటే కార్యాలయంలోని మూమెంటు రిజిస్టర్‌లో ఎక్కడకు వెళుతున్నారో రాయాల్సి వుంది. అయితే ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ ప్రసాద్ తెలిపారు.

సూళ్లూరుపేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట తడ, దొరవారిసత్రం మండలాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ శేఖర్ తెలిపారు. ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కూలిన పీహెచ్‌సీ ప్రహరీ

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రహరీ ఇటీవల కురిసిన వర్షాలకు కొంత వరకు కూలిపోయింది. దీంతో పీహెచ్‌సీ ఆవరణలోకి పశువులు, జీవాలు వస్తుండడంతో పరసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అంతేకాకుండా పీహెచ్‌సీ శివారు ప్రాంతం కావడంతో విషసర్పాలు ఆస్పత్రిలోకి వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అధికారులు స్పందించి కూలిన ప్రహరీని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిత్రపటాల అందజేత

వాకాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అన్నపూర్ణరావుకు టీడీపీ నాయకులు బల్లి హర్ష, దినకర్‌బాబు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను శుక్రవారం అందజేశారు.

రీసర్వే జరిపితే ప్రజాప్రతినిధులకు చెప్పరా?

మీ హయాంలో మాకు చెప్పారా ● రసాభాసగా మండల సమావేశం


మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈఈ భాస్కర్‌రావు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఏఈ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు టీడీపీ హయాంలో ఆగిపోయిన పక్కాగృహాలపై సర్వే చేస్తున్నామని, పెండింగ్ బిల్లులపై దృష్టి పెడతామన్నారు. కొత్తపట్నం ఉప సర్పంచు ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ అధికారులు సర్వే చేసేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. వెంటనే టీడీపీ నేత, కోట ఎంపీటీసీ దారా సురేష్ జోక్యం చేసుకొని మీ హయాంలో మా ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం ఇచ్చారా అంటూ ఎదురు ప్రశ్నించారు. దీంతో ప్రసాద్‌గౌడ్, టీడీపీ ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్ మధ్య కొద్ది సేపు వాదోపవాదాలు జరిగాయి. అనంతరం అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శేషయ్య, జడ్పీటీసీ కోటయ్య, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, వివిధశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

డక్కిలి/బాలాయపల్లి/చిల్లకూరు/తడ/చిట్టమూరు/ఓజిలి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని పాతనాలపాడు, డక్కిలి, శ్రీపురం గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. పాతనాలపాడులో రూ.10 లక్షలు, శ్రీపురంలో రూ.5లక్షలు, డక్కిలిలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ● బాలాయపల్లి మండంలోని బాలాయపల్లిలో రూ.27 లక్షలు, కడగుంటలో రూ.8 లక్షలు, నిండలిలో రూ.10 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ● చిల్లకూరు మండలంలోని ఓడూరులో రూ.10 లక్షలు, కమ్మవారి పాళెంలో రూ.5లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ● తడ మండలంలో రూ.2 కోట్లతో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. ● చిట్టమూరు మండలంలోని బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గామాల్లో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ● ఓజిలి మండలం రాచపాళెంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

గూడూరు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం సమంజసం కాదని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఏఈ ఏడుకొండలుకు వినతిపత్రం అందజేశారు. జోగి శివకుమార్, శ్రీనివాసులు, రమణయ్య, సురేష్, మణి, ప్రసాద్, చంద్రయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నిరసన

నాయుడుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ నాయుడుపేట విద్యుత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మహేష్‌బాబు, ముకుంద, వీరాస్వామి, మోహన్, ప్రతాప్ పాల్గొన్నారు.

గ్రామసభలతో భూసమస్యలకు పరిష్కారం

పెళ్లకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రీసర్వే నిర్వహించిన పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాళ్వాయిపాడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన రీసర్వేలో పొరబాట్లు జరిగి ఉంటే సరిచేసుకునేందుకు ఈ సభలు దోహదపడుతాయన్నారు.

చల్లకాలువలోకి వరదనీరు

కోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోట నుంచి కుడి, ఎడమల నుంచి సముద్రంలో కలిసే చల్లకాలువ నదిలో వరదనీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు స్వర్ణముఖినది నుంచి లింక్ కలుజు ద్వారా వరదనీరు వస్తుండటంతో చల్లకాలువ కరకట్టలకు ఇరువైపులా ఉన్న గ్రామాల్లోని ఫిల్టర్ పాయింట్‌లకు భూగర్భ జలాలశాతం పెరిగే అవకాశం ఉంది.

భక్తులకిచ్చే ప్రసాదం నాణ్యంగా ఉండాలి


చెంగాళమ్మ ఆలయంలో స్టాకు రికార్డులను పరిశీలిస్తున్న సంయుక్త కమిషనర్

సూళ్లూరుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇచ్చే ప్రసాదాలు నాణ్యంగా ఉండాలని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. శుక్రవారం ఆయన చెంగాళమ్మ ఆలయానికి విచ్చేసి భక్తులకు ఇచ్చే ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ రికార్డును తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయించే అమ్మవారి పూజా సామగ్రికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకొన్నారు. లడ్డు, పొంగలి, పులిహోర ప్రసాదాలు నాణ్యత ఉండేలా చూడాలని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మిని ఆదేశించారు.

మొక్కుబడిగా మండల సమావేశం


సమావేశంలో వైద్య ఆరోగ్య సేవలను వివరిస్తున్న డాక్టర్ డానియేల్‌రాజు

ఓజిలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన ఎంపీడీవో విజయలక్ష్మి అధ్వర్యంలో జరిగింది. 10:30 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశం సభ్యులు ఎవరూ రాకపోవడంతో 11:30 గంటలకు ప్రారంభమైంది. అధికారులు వారి శాఖల పనితీరు, ఇతర అంశాలను సభలో వినిపించగా సమావేశానికి హాజరైన సభ్యులు వింటూ కూర్చున్నారు. మండల సమస్యలపై ప్రస్తావన, చర్చకు ఎవరూ ఆసక్తి చూపలేదు. శాఖల వారీ సమీక్షలో భాగంగా ఓజిలి పీహెచ్‌సీ వైద్యులు డానియేల్ రాజు వైద్య ఆరోగ్య సేవలు, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఉపాధి, ఆర్‌అండ్‌బీ, గృహ నిర్మాణ, విద్య, పశువైద్య శాఖల అధికారులు మాట్లాడారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, వైస్ ఎంపీపీలు ప్రసాద్ నాయుడు, మీనాక్షి, ఆరిమేనిపాడు, ఓజిలి, గ్రద్దగుంట ఎంపీటీసీ సభ్యులు రఘురామరాజు, నవీన్, విజయమ్మ, సర్పంచులు పాల్గొన్నారు.

కూటమితోనే యువతకు ఉపాధి: నెలవల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా పోస్టర్లను నెలవల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిస్ ఎక్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ మంగళవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లలోని 24 పరిశ్రమల్లో 1200 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత అయిన వారు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ లోకనాథం, టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, చక్రపాణి, బాబు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కోట ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కోటేశ్వరరావు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట ప్రభుత్వాస్పత్రి స్థాయిని 30నుంచి 50 పడకలకు పెంచాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం అమరావతిలో మంత్రిని కలిసిన కోటేశ్వరరావు కోటలోని ప్రభుత్వాస్పత్రి గురించి వివరించారు. రోగులు పెరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రి స్థాయిని పెంచి అధునాతన సౌకర్యాలు సమకూర్చాలని కోరారు.

బురదమయంగా గ్రామీణ రోడ్లు




పాగాలి గిరిజనకాలనీ నుంచి పాగాలి గ్రామంలోకి వెళ్లే రోడ్డులో దిగబడిపోయిన స్కూల్ బస్సు - దుస్థితిలో ఉన్న చిందేపల్లి నుంచి దళితవాడకు వెళ్లే రహదారి

ఏర్పేడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్ద పంచాయతీల్లో పాగాలి పంచాయతీ ఒకటి. ఈ పంచాయతీలో పాగాలి, పాగాలి దళితవాడ, పాగాలి గిరిజనకాలనీ, కుమ్మరిగుంట, కృష్ణంపల్లెలున్నాయి. అయితే ఈ గ్రామాలు శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు నుంచి 2.5 కిలోమీటర్లు ఉంటాయి. ప్రభుత్వాలు మారుతున్న ఈ గ్రామాలకు మాత్రం తారురోడ్డు నిర్మించలేదు. వర్షాకాలం వస్తే ప్రయాణం నరకప్రాయమే. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఈ గ్రామానికి వచ్చి రోడ్డులో దిగబడిపోయింది. గ్రామస్తుల సహకారంతో ట్రాక్టరు ద్వారా బస్సును ముందుకు లాగి పంపించారు. అదేవిధంగా చిందేపల్లి దళితవాడకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులను తలపిస్తోంది. అలాగే కృష్ణంపల్లికి వెళ్లే రోడ్డు కూడా చాలా అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామీణ రోడ్లపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుడిమల్లం ఆలయానికి డబుల్ రోడ్డు



పనుల ప్రారంభోత్సవంలో గిరినాయుడు తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామి ఆలయానికి పాపానాయుడుపేట నుంచి డబుల్ రోడ్డును ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు తన సొంత నిధులు రూ.5లక్షలతో శ్రీకారం చుట్టారు. పాపానాయుడుపేట స్వర్ణముఖి నది ఒడ్డున మట్టితోలి రోడ్డును ఏర్పాటు చేశారు. ఇందుకు ఆ ప్రాంతంలో పొలాలు ఉన్న ఆరుగురు రైతులు సహకరించారు. దీంతో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, టీడీపీ నేతలు కలిసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. త్వరలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు అవుతాయని గిరినాయుడు తెలిపారు. అధికారులు ప్రమీల, మురగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులను ఆదుకోండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ బాధితులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు నీటమునిగిన ముళ్లపూడి, వేడాం, చుక్కలనిడిగల్లు గిరిజనకాలనీలు, పట్టణంలోని ఈశ్వరయ్య, చెంచులక్ష్మికాలనీ వాసులకు నిత్యావసర వస్తువులను అందించాలన్నారు. జె.గురవయ్య, ఎం.శివకుమార్, మునిరాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష పర్యవేక్షణ చికిత్సతో క్షయ నివారణ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష పర్యవేక్షణ చికిత్స ద్వారా క్షయ వ్యాధి నివారణ అవుతుందని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ నివారణపై ఎంఎల్‌హెచ్‌పిలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు, తేమడతో పాటు రక్తం పడటం, బరువు తగ్గితే టీబీ నిర్ధరణ పరీక్షలు చేసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధరణ అయిన వారికి ఆరు మాసాల పాటు ఉచితంగా మందులు ఇస్తామన్నారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 11 కేవీ లైన్ల నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేణిగుంటలో...

రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ అంజనేయులు తెలిపారు. ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తూకివాకం, గురవరాజుపల్లి, కరకంబాడి, ఎల్లమండ్యం, కురకాలువ, గాజులమండ్యం సబ్‌స్టేషన్లపరిధిలో సరఫరా ఉండదని తెలిపారు

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువైఉన్న కనకదుర్గమ్మకు శుక్రవారం రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు చేశారు. సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

పుత్తూరు వార్తలు

గ్యాస్ కేవైసీ నమోదుకు రేపు ప్రత్యేక డ్రైవ్

పుత్తూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు 20వ తేదీ ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు రవి కుమార్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో కానీ డెలివరీ బాయ్ వద్ద కానీ ఈకేవైసీని నమోదు చేసుకోవచ్చన్నారు. కేవైసీ నమోదు కాని వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవని, సిలిండర్ బుకింగ్ సమయంలో ఓటీపి వచ్చిన వారికే సిలిండర్ల పంపిణీ జరుగుతుందని చెప్పారు.

ట్రూఅప్ చార్జీలు పెంచొద్దు: సీపీఎం

పుత్తూరు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంధన సర్దుబాటు పేరిత విద్యుత్ చార్జీలు పెంచవద్దని సీపీఎం నాయకులు శుక్రవారం విద్యుత్ ఏడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ చార్జీల బాదుడే బాదుడని విమర్శించిన సీఎం చంద్రబాబు, నేడు రూ.8114 కోట్లు దండుకోవడానికి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నదని విమర్శించారు. ప్రజలపై రూ20 నుంచి రూ.100 రూపాయలు వరకు విద్యుత్ చార్జీలు దొడ్డిదారిలో పెంచుతున్నారని విమర్శించారు. అనంతరం రూరల్ ఏఈ, జేఈఈలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విజయ్, శివ, నరసింహులు, మహేష్ తదతరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో అభివృద్ధికి శ్రీకారం



జీహెచ్‌పురంలో జరిగిన భూమి పూజ

వడమాలపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీపురం పంచాయతీ జీహెచ్‌పురంలో రూ.7 లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మునిశేఖర్ మాట్లాడుతూ... పల్లెల్లో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పల్లె పండుగతో శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, నాయకులు శేషాద్రి యాదవ్, హేమావతి, సురేష్‌రాజు,శేఖర్ నాయుడు, గిరి ప్రసాద్, రఘు, మణికంఠ, సుబ్రమణ్యం, పవన్ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



అమర్‌నాథ్ కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకు పంచాయతీ టీఆర్ కండ్రిగలో టీడీపీ నాయకుడు అమర్‌నాథ్ తండ్రి రాజేంద్రరాజు అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గ్రామానికి చేరుకుని అమర్‌నాథ్‌ను, వారి కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, తడుకు సర్పంచు వెంకటేష్ యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ధర్మరాజస్వామి ఆలయ భూమికి సర్వేతో హద్దులు



ఆలయం వద్ద సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ధర్మరాజస్వామి ఆలయ భూమిలోకి అక్రమ నిర్మాణాలు సాగించారని శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే చేసి ఆలయ భూమికి హద్దులను ఏర్పాటు చేశారు. ఎగువవీధి గ్రామంలో పురాతన ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయం సర్వే నెం. 188/5లో 23 సెంట్లలో ఉంది. అయితే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత ఆలయ భూమిలో అక్రమంగా నిర్మాణాలు సాగించారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించకపోవడంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈక్రమంలో మళ్లీ ఎగువవీధివాసులు శుక్రవారం తహసీల్దారు లక్ష్మీనారాయణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఎగువవీధికి చేరుకుని సర్వే నిర్వహించారు. పూరిపాక, నాలుగు అడుగుల మేర మరో వైపున రేకుల షెడ్డు నిర్మించినట్టు గుర్తులు వేసి తొలగిస్తామని చెప్పారు. దీనిపై వైసీపీ నేత... మాట్లాడుతూ నాలుగు తరాల నుంచి ఆలయం పక్కనే తమకు సాగుభూమి ఉందన్నారు. హద్దులు లేకపోవడంతో నిర్మాణాలు జరిపామన్నారు. తొలగించడానికి అభ్యంతరం లేదన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ





అంబూరు, తిమ్మసముద్రం, గోవిందవరంలో అభివృద్ధి పనులకు భూమిపూజ

వరదయ్యపాళెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం అంబూరు పంచాయతీలో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... రూ.4లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. సర్పంచు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ మునిచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: గ్రామాలు అభివృద్ధి చెందడానికే ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీపతిబాబు చెప్పారు. పీవీకండ్రిగ, బైరాజులకండ్రిగ, కొత్తూరు, తిమ్మసముద్రం, రాగిగుంటల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. తిమ్మసముద్రం పంచాయతీలో రూ.25లక్షలతో పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, సర్పంచులు ప్రకాష్ యాదవ్, దొరబాబునాయుడు, సుబ్రహ్మణ్యం, గోపీనాథ్‌రెడ్డి, మునస్వామి యాదవ్, సురేష్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, సాధు, థామస్, మునిశేఖర్, మాజీ సర్పంచ్ బత్తెయ్య, అధికారులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో రూ.10లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి జడ్పీటీసీ మాజీ సభ్యులు పేరం ధనంజయులు నాయుడు, మునిరంగారెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, విజయకుమార్ ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. గోవిందవరంలో రూ.11లక్షలతో మురుగునీటి కాలువ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. చిరంజీవులునాయుడు, ఎంపీడీవో సౌభాగ్యం, నాగరాజునాయుడు, భూపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు. మడిబాక పంచాయతీ అరుంధతివాడలో శుక్రవారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సర్పంచు చెంగల్రాజు, మాజీ సర్పంచ్ మల్లికార్జునాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి, పీవీకండ్రిగ, ఆలత్తూరు, పల్లమాల, కాటూరు, పార్లపల్లి, కొత్తపాళెం, టీబీపురం, భవానీశంకరపురంలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు, గోకులం షెడ్లకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు రవి నాయుడు, మధునాయుడు, శ్రీనివాసులు, దాము, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, రమణయ్య, ఎంపీడీవో త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని గోపాలరావు కాలనీ, బీసీ కాలనీలో రూ.26లక్షలతో "సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, వైస్ సర్పంచ్ చంద్రబాబు, ఈవో బసిరెడ్డి, ఎంపీపీ భారతి, వార్డు సభ్యులు, కూటమి నాయకులు వెంకటేష్, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ అనుసంధానంతో కొత్త ఆలోచనలు



ప్రసంగిస్తున్న నాదముని రెడ్డి

రేణిగుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సును ఏ విభాగానికైనా అనుసంధానిస్తే కొత్త ఆలోచనలతో నూతన నైపుణ్య వేదికలు ఉద్భవిస్తాయని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదమునిరెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో రెండురోజుల జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం 'తృష్ణ' ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలు కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారు పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, రోబోటిక్స్, ట్రెజర్‌హంట్ వంటి సాంకేతిక అంశాలను ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పుష్పలత వివరించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల హెచ్‌వోడీలు, సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ట్రూ అప్ ఛార్జీల భారం మోపొద్దు

శ్రీకాళహస్తి/ కేవీబీపురం/ బుచ్చినాయుడు కండ్రిగ/ పిచ్చాటూరు/ సత్యవేడు/ రేణిగుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలపై ట్రూ అప్ విద్యుత్ ఛార్జీల భారం మోపొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏ.పుల్లయ్య డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఖజానాను నింపుకోవడం కోసం ట్రూ అప్ ఛార్జీల పేరిట రూ.8,104కోట్లు భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. కేవీబీపురం సబ్‌స్టేషన్ వద్ద జరిగిన నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ... ప్రతినెలా విద్యుత్ బిల్లులను రూ.20నుంచి రూ.100 వరకు దొడ్డిదారిన ఛార్జీలు పెంచుతున్నారన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ మునికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని నీర్పాకోట సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య ఆధ్వర్యంలో ట్రూఅప్ ఛార్జీల పెంపుపై నిరసన కార్యక్రమం జరిగింది. పిచ్చాటూరు పట్టణంలోని విద్యుత్ ఇంజనీర్ కార్యాలయంలో ఎదుట సీపీఎం మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ట్రూఅప్ ఛార్జీలపై నిరసన వ్యక్తం చేశారు. సత్యవేడు సబ్‌స్టేషన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై సీపీఎం నాయకులు రేణిగుంట విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు.

విద్యుదాఘాతంతో తమిళనాడువాసి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తమిళనాడువాసి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు కొళత్తూరుకు చెందిన దిలీప్ ఎలక్ట్రీషియన్. శ్రీకాళహస్తి పట్టణంలోని రెవెన్యూ కాలనీలో నిర్మాణంలో ఉన్న కొత్త ఇంటికి ఎలక్ట్రికల్ పనులు చేసేందుకు కొళత్తూరు నుంచి కొందరు యువకులతో వచ్చాడు. శుక్రవారం రాత్రి పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో దిలీప్ అక్కడికక్కడే కుప్పకూలాడు. సహచరులు దిలీప్‌ను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీకాళహస్తి 1టౌన్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సభ్యత్వ నమోదులో అగ్రస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, అక్టోబరు 18: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి అసెంబ్లీ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని ప్రతి కార్యకర్త శరవేగంతో బాధ్యతగా పనిచేసి గత చరిత్రను తిరగ రాశారన్నారు.

భూముల రీసర్వేపై గ్రామసభ

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెం సచివాలయ ఉద్యోగులు దండోరా వేశారు. గత వైసీపీ ప్రభుత్వం జగనన్న భూరక్ష పేరుతో సాంబయ్యపాళెంలో భూముల రీసర్వే చేపట్టింది. సర్వే నెంబర్లు తప్పుగా పడడం, భూ విస్తీర్ణం తగ్గిపోవడంతో పాటు రికార్డుల్లో చిక్కుముడులు ఏర్పడ్డాయి. నాలుగు నెలలుగా ఈ గ్రామంలో భూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కరించేందుకు ఈనెల 22న సాంబయ్యపాళెంలో గ్రామసభను నిర్వహించనున్నారు.

వార్డు సభ్యులు సమావేశాల్లో పాల్గొనాలి

సత్యవేడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పంచాయతీ సమావేశాల్లో విధిగా పాల్గొనాలని జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీల్లో విధులు, బాధ్యతలపై శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేర్ మాట్లాడుతూ... వార్డు సభ్యులు, ఉప సర్పంచులు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులపై అవగాహన చేసుకుని గ్రామాభివృద్ధికి చొరవ చూపాలని కోరారు.

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ



పీవీపురంలో భూమిపూజ చేస్తున్న బాలరాజు

సత్యవేడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ పట్టనుందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు కె.బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని పీవీపురంలో రూ. ఐదు లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గత ప్రభుత్వంలో గాడితప్పిన పంచాయతీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతో పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ఉప సర్పంచ్ దామోదరరాజు, నాయకులు జయరామశెట్టి, వెంకటేష్, వెంకటరామయ్య, సిద్దులయ్య నాయుడు, కార్యదర్శి లీలామాధవ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రాజగోపాలపురంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్, నాయకులు అమాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, రమణరెడ్డి, ఐతం సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లగంగమ్మ గుడి ఆవరణలో రాస్, టాటా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించినక్యాన్సర్ వైద్య ఉచిత శిబిరానికి విశేష స్పందన లభించింది. క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చని రాస్ పొదుపు సంఘాల సంచాలకుడు నాగరాజు తెలిపారు. అనంతరం వైద్యశిబిరంలో పాల్గొన్న వారికి బీపీ, షుగర్, హైపటైటిస్ బి, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డి కుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది ముఖేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవికి రాహుకాలం సమయంలో మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. తీర్థప్రసాద వినియోగంతో పాటూ అన్నదానం జరిగింది.

వేడుకగా ఊంజల సేవ



నారాయణవనం, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వన్‌సైడ్ పార్కింగ్

రేణిగుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 19న శనివారం నుంచి వన్‌సైడ్ పార్కింగ్ అమల్లోకి రానుంది. పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు, బజారువీధి, పోస్టాఫీసు వీధి గంగమ్మ గుడి వరకు ఒక పక్క వాహనాలు పార్కింగ్ చేయాలని రేణిగుంట అర్బన్ పోలీసులు బోర్డులను ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయ్యగుంట గ్రామానికి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో మూడు రోజులు పాటు విద్యుత్ లేక గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్‌ను అందించారు

విద్యార్థులకు అభినందన

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన అబ్దుల్ కలాం ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఎంజీఎం విద్యార్థులు సత్తాచాటారు. అండర్-14 బాలుర విభాగంలో తేజో మారుతిప్రసాద్ రాష్ట్రస్థాయి రెండో స్థానం, బాలికల అండర్-12 లో మీనాక్షి రాష్ట్రస్థాయి మూడో స్థానంలో నిలిచింది. వీరిని ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుద్లూరు ఐశ్వర్యం అభినందించారు.